క్లుప్తంగా

20, 21న 'గురుకుల' బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి పరీక్షలు

సదుం: జిల్లాలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20, 21న తేదీలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్టు కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 6, 8 తరగతులకు 20న, 7, 9 తరగతులకు 21న మధ్యాహ్నం 3 గంటల నుంచి పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు. 3.10 గంటల తరువాత పరీక్ష కేంద్రానికి వచ్చే వారిని అనుమతించమని ఆయన చెప్పారు. హాల్ టికెట్‌లో కేటాయించిన పరీక్ష కేంద్రంలోనే అనుమతిస్తారని, కేంద్రాల మార్పులకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టు, నేరుగా అందించడం లేదని చెప్పారు. ప్రశ్నపత్రం ఇంగ్లీషులో ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష అన్నమయ్య జిల్లా కలికిరి బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9885225352, 8790092069 నంబర్లను సంప్రదించాలన్నారు.

'నేను బడికి పోతా'ర్యాలీ



బైరెడ్డిపల్లెలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండి చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు సహకరించి విద్యార్థులను పనుల్లో పెట్టకుండా బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మురకంబట్టులో ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. 5–8వ తరగతి వరకు చదివేందుకు మైనారిటీ విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్తూరు కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ అరుణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారిగా ఉన్న గోపాలకృష్ణ వర్మను మేనేజర్‌గా, అక్కడ పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డిని రెవెన్యూ అధికారిగా నియమించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనూజాను టౌన్ ప్లానింగ్ విభాగానికి, అమరనాథ్ రెడ్డిని ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. దురై రాజును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, సురేష్ కుమార్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, ప్రకాష్‌ను ప్రజారోగ్య విభాగానికి బదిలీ చేశారు.

కుండపోత వర్షం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు వర్షం పడింది. ఈ వర్షానికి కాలువలు పొంగి పొర్లాయి. చెరువుల్లోకి నీరు సాగాయి. ఎండిపోయిన చెరువులు, కాలువల్లోని గుంతలు నిండుకున్నాయి. చిన్న చిన్న కాలువలు, చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

గంగమ్మకు అంబలి



ఇందిరమ్మకాలనీలో అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగమ్మ జాతర ప్రారంభం అయ్యింది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారి అంబలి, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. నడి వీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని జలప్రవేశానికి తరలించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే, మండలంలోని పాలేరు దళితవాడలో గంగమ్మ జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం తెల్లవారు జామున కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



పాలేరు దళితవాడలో కొలువుదీరిన గంగమ్మ

పుష్ప విలాపం

- గిట్టుబాటు కాని పూలధరలు
- పలమనేరు ప్రాంతంలో కొత్త వెరైటీ బంతి, చామంతి సాగు
- సీజన్‌తో నంబంధం లేకుండా పూల సాగు
- నెలరోజుల్లో భారీగా తగ్గిన పూల ధరలు



పలమనేరు: ఇన్నాళ్లూ ఆహార పంటలు, వాణిజ్య, కూరగాయ పంటలను సాగుచేస్తున్న జిల్లాలోని పడమటి మండలాల రైతులు పూలసాగుపై ఆసక్తి పెంచుకున్నారు. తక్కువ పెట్టుబడితో కనీస ఆదాయం పొందుతుండడంతో హైబ్రిడ్ రకాల పూల సాగు చేస్తున్నారు. దీనికితోడు ఈ ప్రాంతం అటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉండటం, అలాగే ఇరు రాష్ట్రాలకు రవాణా సదుపాయం బాగా ఉండడంతో మార్కెటింగ్‌కు ఢోకా లేకుండా ఉంటోంది. ఫలితంగా సీజన్‌తో నిమిత్తం లేకుండా ఇక్కడి శీతల వాతావరణం పూలసాగుకు అనుకూలంగా మారింది. అయితే నెలకు ముందు గిట్టుబాటు ఉన్న పూల ధరలు ప్రస్తుతం తగ్గముఖం పట్టాయి. దీంతో ఇక్కడి పూల రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పూలసాగు విస్తీర్ణం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని వీ.కోట, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, బైరెడ్డిపల్లె మండలాల్లో ఏటా సాధారణ పూలసాగు 400 ఎకరాలుగా ఉండగా ఈపర్యాయం 600 ఎకరాలకు విస్తరించింది. రకరాకల పంటల సాగుతో చేతులు కాల్చుకుంటున్న రైతులు పూల సాగులో నికర ఆదాయం కళ్లజూస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బంతిలో టాల్‌బాల్, ఎల్లో ఎక్స్‌ప్రెస్, సిరి, అష్టగంధ కంపెనీలకు చెందిన ఆరెంజ్, ఎల్లో రకాలు, చామంతిలో పేపర్ ఎల్లో, పేపర్ వైట్, మ్యారీ గోల్డ్, సెంట్ ఎల్లో, సెంట్ వైట్, బుల్లెట్, చాందినీ రకాలను ఎక్కువగా సాగు చేశారు. ఇవన్నీ కొత్తగా ఉత్పత్తి చేసిన హైబ్రిడ్ రకాలు కావడంతో పంట ఏపుగా పెరిగి ఉత్పత్తులు అధికంగా వచ్చే రకాలు.

నెల రోజుల్లో అమాంతం తగ్గిన ధరలు

మే నెల మొదటి వారంలో చామంతి కిలో రూ.250 నుంచి 300 దాకా ఉండేది. బంతి పూలు కిలో రూ. వందకు పైగా పలికింది. అయితే ఎన్నికల ఫలితాలొచ్చాక పూల ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం పలమనేరు, కుప్పం, వీ.కోట పూల మార్కెట్లలో చామంతి కిలో రూ.120 నుంచి రూ.150, బంతి కిలో రూ.30 నుంచి 40కి పడిపోయింది. దీంతో పూల తమకు పెట్టుబడి అయినా దక్కుతుందో లేదో చెప్పలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.





బైరెడ్డిపల్లె మండలంలో సాగవుతున్న హైబ్రిడ్ రకం చామంతి, బంతి పూల తోటలు

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

సదుం: మండలంలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహి విజ్ఞప్తి చేశారు. తడిచేతులతో విద్యుత్ ఉపకరణాలు తాకరాదని, పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ కేబుళ్లను పరిశీలించడంతో పాటు, మోటార్లు ఆన్‌చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ కేబుళ్లు, లైన్లు గాలులకు తెగిఉంటే వెంటనే తమ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేష్

బైరెడ్డిపల్లె: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ రాజేష్ ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. పేడదిబ్బలను తొలగించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పైపులైన్ లీకేజీలు ఉన్నపక్షంలో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజేంద్రబాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకనాథం, ఎస్‌బీఎం మండల కో–ఆర్డినేటర్ సురేష్‌బాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ లక్ష్మయ్య

గుడుపల్లె: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు శ్రీదేవి, లక్ష్మయ్య కోరారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి ఎంఈఓలు మాట్లాడారు. గ్రామాలలోని 6 నుంచి 14 ఏళ్ల లోపు ఉన్న పిల్లలు బడిలో ఉండాలన్నారు. బడి మానేసి డ్రాపౌట్లుగా ఉన్న వారిని కూడా తిరిగి బడుల్లో చేర్పించాలన్నారు. జులై 7వ తేది వరకు ప్రతి గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయులు ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, నాయకుల ఆధ్వర్యంలో పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. రోజు వారీగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి శంకర్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంఆర్‌సీ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



తూర్పుగడ్డలో కొలువుదీరిన గంగమ్మ



వి.కోట: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని తూర్పుగడ్డలో మంగళవారం వైభవంగా గంగ జాతరను నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారి శిరస్సును ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. మొక్కుబడులు చెల్లించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వి.కోట మండలంలో..

వి.కోట: మండలంలోని దాసార్లపల్లె, ముదిమడుగు, బసాపురం గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. సోమ వారం సాయంత్రం నుంచి గ్రామాల్లో అమ్మవారి శిరస్సు ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో పూలగెరిగ, డప్పు, బాజాభజంత్రీలు, బాణసంచా వేడుకల నడుమ మహిళలు దీపాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. సోమవారం రాత్రి దాసార్లపల్లెలో తిరుపతికి చెందిన కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జాతర సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.





ముదిమడుగులో ఊరేగింపు, తలపై రోకలిబండతో బిందె నీటిని మోస్తూ..

అన్నా క్యాంటీన్ల పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో నిర్వహణలో ఉండి మూతబడిన అన్నా క్యాంటీన్లను మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ పరిశీలించారు. ముఖ్యంగా తిరుపతి నగరంలో ఎంఆర్ పల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట, ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట, న్యూ బాలాజీ కాలనీలో, స్విమ్స్ సర్కిల్ వద్ద గతంలో ఏర్పాటు చేసి, తర్వాత ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించిన అన్నా క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించి ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తను తొలగించాలని, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. తిరుపతి పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీఈ మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

గోహంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: దైవంగా భావించే గోవులను అక్రమంగా తరలిస్తూ వధించే గో హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని భజరంగదళ్ జిల్లా కన్వీనర్ కిరీటిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నిత్యం గోవధ జరుగుతోందని, ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని వినతి పత్రాలు సమర్పించినా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. అక్రమ గో రవాణాను అడ్డుకోవాల్సిన రవాణా శాఖ, అక్రమ వధ శాలలను మూసి వేయాల్సిన పురపాలక శాఖ, పశు సంవర్ధక శాఖ తగిన చర్యలు తీసుకోకపోవడంతో మరింత మితిమీరుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు గోవధను నిషేధించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో విశ్వ హిందూ పరిషత్ భజరంగదళ్ ప్రతినిధులు రాజీవ్‌రెడ్డి, చంటి, రామకృష్ణ, వాసు, పురుషోత్తం, రమాదేవి, విజయలక్ష్మి, శ్రీనివాసన్, విష్ణుప్రతీక్‌రెడ్డిడ్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించండి... చదివించండి


పాకాల: మండలంలోని మొగరాల పంచాయతీలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఐసీడీఎస్ చంద్రగిరి ప్రాజెక్టు, దామలచెరువు సెక్టార్ ఆధ్వర్యంలో మొగరాల జడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోని ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లల్ని చదివించండి అంటూ పిలుపునిచ్చారు. సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల ద్వారా ఆడపిల్లల అభివృద్ధి సాధిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు షమీం, మోహన, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో బీసీజీ వ్యాక్సిన్



క్షయ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గంగవరం: గంగవరం, పత్తికొండ పీహెచ్‌సీల్లో క్షయవ్యాధి నివారణ టీకా(అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నట్టు వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. రెండు పీహెచ్‌సీల పరిధిలోని సచివాలయాలు వద్ద మంగళవారం టీకాలు వేశారు. ఒక్క రోజే దాదాపు 300మంది ఈ వ్యాక్సిన్ వేసుకోగా, ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 4వేల మందికి టీకా పూర్తి చేసినట్టు వైద్యులు చెప్పారు. గత నెల నుంచి ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతంలో వ్యాధిబారిన పడి ఐదేళ్లు గడిచిన వారికి, వ్యాధి లేకపోయినా 60 ఏళ్లు పైబడిన అందరికీ, 18 ఏళ్లు పైబడి మధుమేహం వ్యాధి, ధూమపానం అలవాటు ఉన్న వారికి, అలాగే ఇంటిలో కుటుంబ సభ్యుడికి వ్యాధి ఉంటే వారితో కాంటాక్ట్ ఉన్న వారందరికీ క్షయ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త కోసం ఈ టీకా వేస్తున్నట్టు చెప్పారు. ఈ టీకాపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ప్రతి ఒక్కరూ ఈ టీకా తప్పనిసరిగా వేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి సోమ, గురు వారం ఈ టీకా వేస్తున్నట్టు చెప్పారు. 2027 సంవత్సరం నాటికి క్షయను పూర్తిగా రూపుమాపాలన్నదే ఈ టీకా కార్యక్రమం లక్ష్యమన్నారు.



ఆకాశం ఇంద్రధనుస్సు చీర కట్టి..

మండలంలో పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. మండల కేంద్రంలో వాన కురవకపోయినా సగం ఆకాశానికి సప్తవర్ణాల్లో చీర చుట్టినట్లు ఇంద్రధనుస్సు చూపరులను ఆకట్టుకుంది. –సదుం

మృగరాజుపై శ్రీరాముడి చిద్విలాసం



టి.పుత్తూరు కోదండరాములు దేవస్థానంలో ఉయ్యాల సేవ నిర్వహిస్తున్న ఉభయదారులు



సింహ వాహనంపై శ్రీరాముడి చిద్విలాసం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాములు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సింహ వాహనంపై శ్రీరాముడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో ఉదయం వేదపండితులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. ఉభయదారులు దొరస్వామిరెడ్డి కుటుంబసభ్యులు స్వామి వారికి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు ప్రసాద్‌రెడ్డి పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉభయదారులు కోదండరెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాల సేవ నిర్వహించారు.

సింహ వాహనంపై శ్రీరాముడి విహారం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సింహ వాహనంపై ఊరేగితూ స్వామి వారు భక్తులను అనుగ్రహించారు. ఉభదారులు తులసిరెడ్డి కుటుంబ సభ్యులు పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పరిమళ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న సింహ వాహనంపై శ్రీరాముడు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

నేడు హనుమంతు వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రి హనుమంతు వాహన సేవ నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.

గంగమ్మా..కరుణించమ్మా!



న్యూ ప్రశాంత్‌నగర్‌లో కొలువుదీరిన అమ్మవారు



అమ్మవారి దర్శనార్థం క్యూ కట్టిన భక్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని న్యూ ప్రశాంత్‌నగర్‌లో మంగళవారం గంగజాతరను వేడుకగా ప్రారంభించారు. మండపంలో ఉదయం అమ్మవారి శిరస్సును కొలువుదీర్చారు. తెరను లాంఛనంగా ప్రారంభించి భక్తిశ్రద్ధలతో తొలిపూజ చేశారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి, అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి అంబలి పోశారు. అనంతరం నిత్యపూజలు కొనసాగాయి. అమ్మవారి దర్శనార్థం భక్తులు క్యూ కట్టారు. భక్తులకు జాతర పెద్దలు పసుపు, కుంకుమ, ప్రసాదం అందజేశారు. పలువురు ప్రముఖులు అమ్మవారికి గజమాల సమర్పించి మొక్కులు చెల్లించారు. రాత్రి వీధినాటక ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు రామచంద్ర, సౌందరరాజన్, శ్రీనివాసులు, రమేష్, విజయ్, ప్రకాష్, రాజా యాదవ్, అంజి, నరేష్‌కుమార్, శివక్రిష్ణ, వెంకటేష్, శేఖర్‌బాబు, జగదీష్, వీరయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.